జగనన్నతో రాష్ట్రంలో అభివృద్ధి

- వ్యాపారులు, కార్మిక వర్గాలను కలిసి మద్దతు కోరిన ఆసిఫ్
- 37వ డివిజన్‌లోని వస్త్రలత, తారాపేటల్లో పర్యటన



ముఠా ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ 'పశ్చిమ' ఇన్‌చార్జి ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ చెప్పారు. గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమంలో భాగంగా 37వ డివిజన్‌లోని వస్త్రలత, తారాపేట తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ ఆధ్వర్యంలో షేక్ ఆసిఫ్ పర్యటించారు. వస్త్రలతలోని ప్రతి దుకాణం వద్దకు వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రానున్న కాలంలో వ్యాపార వర్గాలకు అండగా ఉంటామని హామీనిచ్చారు. వస్త్రలత, తారాపేట ప్రాంతాల్లో కార్మికులను కలిసి మద్దతు కోరారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి అందరూ అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ చంద్రబాబు తన పరిపాలనలో అడ్డగోలు నిర్ణయాలతో వేలాది కోట్ల రూపాయాల కుంభకోణాలు చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలు పరుగులు తీస్తున్నాయన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలు ఏపీలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని వివరించారు. ప్రధానంగా విద్య, వైద్య రంగాల్లో జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన అనేక సంస్కరణలు ఆయా రంగాలను మరింత పరిపుష్టం చేశాయన్నారు. వైద్యరంగంలో నిర్ణయాలు ప్రజలకు ఆరోగ్య భద్రతను కల్పిస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు నియోజకవర్గంలో చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఆయన వస్త్రలతలో పర్యటించారు. ఆ ప్రాంగణంలోని ముఠా కార్మిక సంఘ నేతలను కలిసి మద్దతు కోరారు. కార్మిక సమస్యల పరిష్కారానికి అండగా ఉంటానని వివరించారు. అక్కడి నుంచి తారాపేటకు వచ్చిన ఆసిఫ్ క్లాత్ ముఠా కార్మికులను కలిసి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. తొలుత వస్త్రలత నాయకులు వోలేటి జగన్‌మోహనరావు, కొత్తమాసు అనీల్‌కుమార్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, కార్పొరేటర్లు యలకల చలపతిరావు, బుల్లా విజయకుమార్, మహాదేవు అప్పాజీరావు, ఆర్షద్, చైతన్యరెడ్డి, కోటిరెడ్డి, నరేంద్ర, అప్పాజీరావు, ఇర్ఫాన్, నాయకులు విశ్వనాథ రవి, అత్తులూరి పెదబాబు, తంగెళ్ల రాము, దేరంగులు రమణ, మజ్జి శ్రీనివాసరావు, మండల శ్రీను, ఉండేల శ్రీనివాసరెడ్డి, శంకరరెడ్డి, గ్రంధి బుజ్జి, కంపా గంగాధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

భవానీపురం(విజయవాడపశ్చిమ): కబేళా విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా బుధవారం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కబేళా సెంటర్, రోటరీనగర్, బ్రహ్మయ్య కాలనీ, మిల్క్ కాలనీ, మిథిలానగర్, సితార సెంటర్ తదితర ప్రాంతాల్లో కరెంట్ నిలిపివేయనున్నట్లు వివరించారు.

11న శతాధిక కవి సమ్మేళనం



విజయవాడ కల్చరల్: జాతికి స్ఫూర్తినింపిన మహనీయుడు డాక్టర్ అంబేడ్కర్ సాక్షిగా ఫిబ్రవరి 11వ తేదీ ఆదివారం మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కలిమిశ్రీ అన్నారు. స్వరాజ్య మైదానంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కలిమిశ్రీ మాట్లాడుతూ పుణ్యభూమి నా దేశం నమో నమామి పేరుతో శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవాడలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పుస్తక ఆవిష్కరణలు జరుగుతాయని కవి సమ్మేళనంలో పాల్గొనే కవులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని 83329 03156 నంబరులో సంప్రదించాలని కోరారు. ఆవిష్కరణ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ రాఘవేంద్రశేఖర్, సంస్థ సభ్యుడు కుర్రా సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా గుణదల లూర్దు మాత వేడుకలు



పెనమలూరు: గుణదల లూర్దుమాత వంద వసంతాల వేడుకలు కానూరు మౌంట్‌కార్మిల్ పుణ్యక్షేత్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గుణదల పుణ్యక్షేత్రం నుంచి వచ్చిన గుణదల లూర్దుమాత స్వరూపాన్ని ఫాదర్ చలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో భక్తుల దీవెనల కోసం ప్రదర్శించారు. గంగూరు, పోరంకి, కామయ్యతోపు, కానూరు నుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భక్తులు కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి లూర్దుమాతను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఫాదర్లు ప్రదీప్, దేవదానం, ఉపదేశకులు పాల్గొని దివ్యబలి పూజ జరిపారు.

క్యాట్ ఒలింపియాడ్ లెవెల్-2లో 'చైతన్య' ప్రతిభ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల నిర్వహించిన క్యాట్ ఒలింపియాడ్ లెవెల్-2 పరీక్షలో శ్రీచైతన్య భవానీపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొత్తం 49 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో ఎస్.శ్రీనందిని, బ్లెస్సీ.కె, గాయత్రి.ఎస్, కీర్తి సుధ.కె నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్స్ అందుకున్నారు. మిగిలినవారిలో 16 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్, 29 మంది మెరిట్ సర్టిఫికెట్స్ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విజేతలను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఈజీఎం మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ జి.,సత్యచిత్ర, ఆర్ఐ వి.రామారావు, అకడమిక్ కో ఆర్డినేటర్ చక్రధర్ ప్రసాద్, డీన్ రంగారావు, సీ-బ్యాచ్ ఇన్‌చార్జ్ నాగరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆటో ఢీ.. ఇద్దరికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులను గుర్తు తెలియని ఆటో ఢీ కొనడంతో గాయపడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఘటనపై యువకుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లంబాడీపేట గురుస్వామి వీధికి చెందిన చెరుకూరి మాణిక్యాలరావుకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు అజయ్ కుమార్ డిగ్రీ చదివాడు. మంగళవారం మధ్యాహ్నం అజయ్‌కుమార్ తన తమ్ముడు ఉదయ్‌కుమార్‌తో కలిసి విద్యాధరపురంలో స్నేహితుడిని కలిసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా నైనవరం ఫ్లై ఓవర్‌పై గుర్తు తెలియని ఆటో ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే వన్‌టౌన్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న మాణిక్యాలరావు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రివర్‌ఫ్రంట్ పార్క్‌ను అందుబాటులోకి తీసుకురండి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



రివర్‌ఫ్రంట్ పార్క్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): కృష్ణానది పరివాహకంలో వీఎంసీ ఆధ్వర్యాన నిర్మిస్తున్న రివర్ ఫ్రంట్ పార్క్‌ను 15 రోజుల్లోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రివర్ ఫ్రంట్ పార్క్‌ను మంగళవారం ఉదయం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలంటే కేవలం ముఖద్వారాన వెళ్లి చివరి వరకు పనులు పూర్తి చేయాలంటే కష్టమని, వెనక వైపు నుంచి కూడా ఒక మార్గాన్ని సూచించి ఇరువైపులా పనులు త్వరితగతిన జరగాలని తెలిపారు. కృష్ణానది రిటైనింగ్ వాల్ వెంట సుందరంగా, ఆహ్లాదకరమైన పార్కు ఏర్పాటుక పనులు జరుగుతున్నాయన్నారు. కనకదుర్గ వారధి నుంచి రామలింగేశ్వర డీపీ స్టేషన్ వరకు 1.25 కి.మీ పొడవున రూ.7.8 కోట్ల నగర పాలక సంస్థ వ్యయ అంచనాతో, రూ.4.5 కోట్ల అర్బన్ గ్రీనరీ వారి వ్యయంతో జరుగుతున్న రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కును త్వరగా అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ట్రీ కెనాపీ, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ రోడ్లు, బేస్మెంట్ పనులు పరిశీలించారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనులను 15 రోజుల్లో పూర్తి చేయండి

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను 15 రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, వెహికల్ డిపో వద్ద ఉన్న కెనాల్బండ్ అత్యంత సుందరంగా తీర్చిదిద్దడానికి పార్క్ లో గ్రీనరీ అభివృద్ధి చేయాలని కమిషనర్ అన్నారు. మంగళవారం ఉదయం నగర పర్యటన లో భాగంగా ఆయన మధురానగర్‌లో వీఎంసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించారు. పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీనివాస్, నారాయణమూర్తి పాల్గొన్నారు.

రేపు 'పశ్చిమ'లో ఆత్మీయ సమ్మేళనం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్‌ఆసిఫ్
- హాజరుకానున్న పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త అయోధ్యరామిరెడ్డి
- మేయర్ భాగ్యలక్ష్మి అధ్యక్షతన కార్పొరేటర్ల సమావేశం



సమావేశంలో ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ శ్రేణుల పశ్చిమ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 25వ తేదీ నిర్వహించనున్నట్లు ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ తెలిపారు. ఈ సమావేశాన్ని కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ అన్ని విభాగాల బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పంజా సెంటర్‌లోని పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన మంగళవారం రాత్రి కార్పొరేటర్ల సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో పార్టీ పశ్చిమ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యాధరపురంలోని ఎస్ కన్వెన్షన్ ప్రాంగణంలో ఈ నెల 25వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి కేశినేని నానితో పాటుగా పలువురు ప్రముఖులు హాజరవుతారని వివరించారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం కావటానికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ఏపీ స్టేట్ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీల, కార్పొరేటర్లు యలకల చలపతిరావు, బుల్లా విజయకుమార్, మహాదేవు అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, ఆర్షద్, చైతన్యరెడ్డి, కోటిరెడ్డి, నరేంద్ర, అప్పాజీరావు, ఇర్ఫాన్, ఆంజనేయరెడ్డి, మండేపూడి ఛటర్జీ, నాయకులు రాయన నరేంద్ర, విశ్వనాథ రవి, మైలవరపు దుర్గారావు, కృష్ణారావు, అత్తులూరి పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ఎస్ఆర్ఆర్ విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు క్రాస్ కంట్రీ, సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటి ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో విజేతల అభినందన కార్యక్రమం జరిగింది. ఉయ్యూరులో జరిగిన కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ పోటీల్లో కళాశాల విద్యార్థులు ఛాంపియన్ షిప్‌తో మొదటి స్థానం సాధించారు. అలాగే సాఫ్ట్‌బాల్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచారు. క్రాస్ కంట్రీ పోటీల్లో జీ వెంకటేష్, జీ తరుణ్‌లు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు సెలెక్ట్ అయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. సాఫ్ట్‌బాల్ పోటీల్లో కే శ్రీను సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీకి సెలెక్ట్ అవ్వడం కళాశాలకే గర్వకారణంగా పేర్కొన్నారు. ప్రిన్సిపాల్, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ డి.యుగంధర్ అభినందించారు.

రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో అంతర్గత రహదారి అభివృద్ధి నిమిత్తం స్థానిక అధికారులు అంచనాలు రూపొందించి నిధులు మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదించారు. గ్రామంలోని మైమార్ట్ సమీపంలో కనుమూరి మాన్సన్ నుంచి రామకృష్ణ ఎన్క్లేవ్ వరకు సీసీ రహదారి అభివృద్ధికి ఇటీవల కాలనీ వాసులు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును కలిసి స్పందనలో వినతి పత్రం సమర్పించారు. దీనికి స్పందించిన అధికారులు తగు చర్యలు ప్రారంభించారు. ఈ రహదారిని 154 మీటర్ల పొడవునా సిమెంట్ రహదారితో పాటు డ్రెయిన్ నిర్మాణానికి రూ.22 లక్షలతో అంచనాలు తయారు చేసి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి రహదారిని అభివృద్ధి చేయనున్నారు.

అన్న సమారాధనకు రూ.1.78 లక్షల విరాళం



పెనమలూరు: పెనమలూరులో ఆదివారం జరగనున్న అయ్యప్పస్వామి అన్న సమారాధనకు అమెరికాకు చెందిన ఎన్నారైలు మంగళవారం విరాళం అందజేశారు. గ్రామంలో గత 44 సంవత్సరాలుగా అయ్యప్పస్వామి అన్న సమారాధనను భక్తులు నిర్వహిస్తున్నారు. జనవరి 28వ తేదీన నిర్వహించనున్న అన్న సమారాధనకు అవసరమైన బియ్యానికి రూ.1,78,655ను ఎన్నారైలు పంపారు. ఈ మేరకు నిర్వాహకులకు నగదును ఎన్నారై ప్రతినిధులు మోర్ల నరేంద్రబాబు, కిలారు ప్రవీణ్, పాలడుగు సుధీర్ అందజేశారు.

యూనిట్లు స్థాపించేలా ఆర్పీలు చూడాలి



మాట్లాడుతున్న శాంతి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వృత్తి విద్యాకోర్సులను నేర్చుకున్న వారితో యూనిట్లను స్థాపించేలా రిసోర్స్ పర్సన్స్ చూడాలని ఎన్టీఆర్ జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ కె.శాంతి చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో మంగళవారం వృత్తి విద్యాకోర్సులకు శిక్షణ ఇచ్చే రిసోర్స్ పర్సన్స్‌కు కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ జరిగింది. శాంతి మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వృత్తి విద్యా కోర్సులపై దృష్టి పెట్టాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని స్వయం ఉపాధి పొందేలా యువతను తీర్చిదిద్దాలని ఆమె అన్నారు. వ్యాపారవేత్త సీహెచ్ సుశీల మాట్లాడుతూ మహిళలు తయారు చేసిన వివిధ వస్తువులను సోషల్ మీడియా ద్వారా మార్కెటింగ్ చేసుకుని మంచి ఆదాయం పొందవచ్చని చెప్పారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా మాట్లాడుతూ విద్యార్థులను అప్‌డేట్ చేస్తూనే రిసోర్స్ పర్సన్ కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుండాలని, అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

తుది జాబితాలో లేకపోతే నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ఓటర్ల తుది జాబితా విడుదలైన సందర్భంలో, తమ పేరు తుది జాబితాలో లేకపోతే వెంటనే నమోదు చేసుకోవాలని సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో మంగళవారం నిర్వహించిన రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుది జాబితా నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రతి పోలింగ్ స్టేషన్లో అందుబాటులో ఉందని, ఓటర్లు తమ ప్రాంతంలోని బీఎల్వోల ద్వారా కూడా అడిగి తెలుసుకోవచ్చని తెలిపారు. ఒకవేళ ఓటర్ల పేరు తుది జాబితాలో లేనట్లయితే వెంటనే ఫాం 6ను నింపి బీఎల్వోలకు సమర్పించాలన్నారు. సెంట్రల్‌లో మొత్తం 2,73,754 ఓట్లు ఉన్నాయని అందులో మహిళల ఓట్లు 1,40,656 కాగా మగవారి ఓట్లు 1,33,048 ఉండగా ఇతర ఓట్లు 50 ఉన్నారని తెలిపారు. గత సమావేశంలో 1400 కంటే ఎక్కువగా ఉన్న ఓటర్లకు ఉండే పోలింగ్ బూత్‌లో ఒక ఆక్సిలరీ బూత్‌ను ఏర్పాటు చేసేందుకు వసతులు ఉన్నాయో లేవో తెలుసుకోవాలని బీఎల్వోలకు చెప్పామన్నారు. వీటి ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయని వారు నివేదిక ఇచ్చారన్నారు. మరో ఐదు పోలింగ్ కేంద్రాలు ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలుగా అదే పోలింగ్ బూత్‌లో రాబోతున్నాయని తెలిపారు. సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు వై.సుందర్ పాల్ (వైఎస్సార్ సీపీ), వెంకట్ (బీజేపీ), ఎస్ఏ అన్సారి (కాంగ్రెస్), వీరభద్రరావు (సీపీఐ), యం వినోద్ కుమార్ (బహుజన్ సమాజ్ పార్టీ), చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, జెడ్ సి-2 మల్యాద్రి, డెప్యూటీ తహసిల్దార్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధనుంజయుడు పేరుతో పోస్టల్ స్టాంప్ విడుదలకు వినతి



విజయబాబుకు వినతిపత్రం అందజేస్తున్న పీవీఎల్ఎన్ రాజు, కొర్ర నారాయణ ముదిరాజ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): తొలి తెలుగు శాసనకర్త ఎరికల్ ముత్తురాజు ధనుంజయుడు పేరుతో పోస్టల్ స్టాంప్, స్మారక నాణెం విడుదల చేసేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబును తొలి తెలుగు దివ్వె సంస్థ వ్యవస్థాపకుడు పీవీఎల్ఎన్ రాజు, ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్ర నారాయణ కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధనుంజయుడి గురించి 2020లో 5వ తరగతి ప్రభుత్వ తెలుగు వాచకంలో తొలి తెలుగు దివ్వె, తెలుగు మూలాల అధ్యయన సంఘం(విజయవాడ) సౌజన్యంతో ప్రచురించారని గుర్తు చేశారు. తెలుగు భాష గురించి విశ్లేషణాత్మక పరిశోధన చేసిన చారిత్రక పరిశోధకులు తొలి తెలుగు శాసనకర్త ఎరికల్ ముత్తురాజు ధనుంజయుడని నిర్ధారించారని వివరించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరిట పోస్టల్ స్టాంప్, స్మారక నాణేన్ని విడుదల చేస్తే ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాభిమానులు ఎంతో సంతోషిస్తారని తెలిపారు.

బీసీ కమిషన్ సభ్యుడు మారేష్‌కు అభినందన

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ బీసీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ ఎస్.మారేష్‌ను ఏపీ ముదిరాజ్/ముతరాసి కార్పొరేషన్ చైర్మన్ కొర్న నారాయణ ముదిరాజ్ ఒక ప్రకటనలో అభినందించారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ మారేష్ తమ సామాజికవర్గానికి చెందినవారు కావడం గర్వకారణమని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వెనుకబడిన కులాలకు ప్రాధాన్యమిచ్చి వారికి సముచిత స్థానాలను కల్పించారని తెలిపారు. సామాన్యుడనైన తనను ఏపీ ముదిరాజ్/ముతరాసి అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించటమే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి చెందినవారే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వెన్నుదన్నుగా ఉండి గెలిపించుకుని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉంటేనే పారదర్శక పాలన కొనసాగుతుందని పేర్కొన్నారు.

14న సామూహిక ఉచిత అక్షరాభ్యాసాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శోభకృత్ నామ సంవత్సర మాఘ శుద్ధ పంచమి పురస్కరించుకుని ఫిబ్రవరి 14వ తేదీ సామూహిక ఉచిత అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సాయిశ్రీ హైస్కూల్ ప్రిన్సిపాల్ బాదినేని రాము మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు లంబాడీపేట గాంధీబొమ్మ సెంటర్‌లోని సాయిశ్రీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ చిన్నారులకు ఉచితంగా అక్షరాభ్యాసం చేయించుకునే తల్లిదండ్రులు వచ్చే నెల 10వ తేదీలోపు పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. అక్షరాభ్యాసం చేసుకునే చిన్నారులకు ఉచితంగా పలక, స్లేట్ పెన్సిల్, ప్రసాదాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

దాసాంజనేయుడికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో మంగళవారం ఆలయ అర్చకులు స్వామివారికి విశేషంగా సిందూర పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆరో డివిజన్ కార్పొరేటర్ వియ్యపు అమర్నాథ్ ఆధ్వర్యాన బుధవారం మారుతీనగర్ కోకో కోలా కొండపై బెల్లపు శ్రీరాములు స్కూల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. దీన్ని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ప్రారంభించనుండగా, సీతారామపురంలోని దీపక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేయనున్నట్లు ఆస్పత్రి అధినేత పి.సురేష్ కుమార్ తెలిపారు. శిబిరంలో వైద్య పరీక్షలతో పాటు, బీపీ, షుగర్, ఈసీజీ, బ్లడ్ గ్రూపింగ్ వంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

విజయవాడ కల్చరల్: వెనిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ బుధవారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరావు, ప్రధాన కార్యదర్శి నీలం దుర్గారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఐదు గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ఓబుల్‌రెడ్డి బృందం వైద్య సేవలు అందిస్తారని కళాకారులు, కళాభిమానులు అవకాశం ఉపయోగించుకోవాలని సూచించారు.

వైఎస్సార్ బీమా అందజేత



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని రావిచెట్టు సెంటర్‌లో నివసిస్తున్న కర్నాటి శ్రీనివాసరావు అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి పేరు వైఎస్సార్ బీమా పథకంలో నమోదైన నేపథ్యంలో మట్టి ఖర్చుల కింద రూ.10వేల నగదును స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా మృతుడి అయిన భార్య కర్నాటి స్వరాజ్యానికి అందజేశారు. ఈ సందర్భంగా రెహమతున్నీసా మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందినవారు సహజ మరణంగానీ, ప్రమాదవశాత్తుగానీ మరణిస్తే వైఎస్సార్ బీమా పథకం ద్వారా ఆదుకుంటుందని తెలిపారు. మృతుడి నామినీకి త్వరలో మిగిలిన సొమ్ము ఆమె బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని నేతలు చెప్పారు.

మదర్సాకు గ్రైండర్ పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మంగళవారం ఉర్దూ పాఠశాల మదర్సాకు గ్రైండర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, నాగమల్లిక, హేమంతరావు మాట్లాడుతూ తమవంతు బాధ్యతగా మదర్సాకు గ్రైండర్ పంపిణీ చేస్తున్నామన్నారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గుంటుపల్లి కేంద్రియ విద్యాలయంలో మంగళవారం పరాక్రమ దివస్‌గా పాటించారు. ప్రిన్సిపాల్ పీవీఎస్ఆర్ కృష్ణ సిబ్బందితో కలిసి నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 11 పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఐదుగురు విద్యార్థులను విజేతలుగా ప్రకటించారు. విజేతలకు ప్రధాని నరేంద్రమోదీ రచించిన ఎగ్జామ్ వారియర్ పుస్తకం, సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.